# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## 3 గంటలొద్దు 10 హెచ్‌పీ వద్దు

ఉమ్మడి రాష్ట్రంలో రైతులు పంటలు పండించుకోవడానికి తీరొక్క ఇబ్బందులు పడ్డారు. పంట వేసింది మొదలు చేతికొచ్చే వరకు తంటాలు పడేవారు. వరి నాటు వేసినప్పటి నుంచి నీటి తడులు పెట్టేందుకు ముప్పు తిప్పలు పడేవారు. విద్యుత్ సరిగా రాకపోవడం.. వచ్చినా లో వోల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోవడం.. అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం.. వాటిని బాగు చేయించుకోవడానికి ఆయకట్టు రైతులందరూ చందాలు వేసుకోవడం నిత్యకృత్యమయ్యేది. ఒక దశలో కళ్ల ముందు పంట ఎండిపోతుంటే దిగులు చెందుతూ కన్నీరు పెట్టుకునేవారు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చేది అంటూ మదనపడేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ సాగునీటి కష్టాలు తీర్చాలని 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం 24 గంటల విద్యుత్ అవసరం లేదని, 3 గంటలు చాలని సభలు, సమావేశాల్లో పదే పదే వల్లించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం గురించి తెలియని వారు అలాంటి మాటలు మాట్లాడతారని, మూడు గంటల విద్యుత్‌తో మూడు రోజులైనా ఒక్క మడి కూడా తడవదని చెబుతున్నారు. *- భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)*

**కాంగ్రెస్ నేతల తీరుపై రైతుల ఆగ్రహం**
- 24 గంటల కరెంటు ఇచ్చే బీఆర్‌ఎస్‌కే మా మద్దతు
- మూడు గంటల విద్యుత్‌తో మూడు రోజులైనా మడి తడవదు
- పెద్ద మోటర్లతో రైతులపై రూ.లక్షకుపైగా ఆర్థిక భారం
- రైతు వ్యతిరేకి కాంగ్రెస్ అంటున్న కర్షకులు

### కాంగ్రెస్ అంటేనే తకరారు



మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ మాకొద్దు. 24 గంటలు కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్సే ముద్దు. 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ సర్కారే మాకు కావాలె. కాంగ్రెస్ వాళ్లు మూడు గంటలు కరెంట్ చాలు. రైతులు 10 హెచ్‌పీ మోటారు వాడుకోవాలి అంటున్నారు. 10 హెచ్‌పీ మోటరు అంటే ఎంతో సొమ్ము కావాలి. 10 హెచ్‌పీ మోటరు వాడితే బోర్లు ఉంటాయా? రైతులందరూ 10 హెచ్‌పీ మోటార్లు వాడితే లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయా? గతంలో ఊర్లో ట్రాన్స్‌ఫార్మర్ పాడయితే మళ్లీ బాగు చేసేందుకు నెలలు పట్టేది. అన్ని రోజులు ఊర్లో కరెంటే ఉండేది కాదు. మళ్లీ అలాంటి రోజులు మాకొద్దు, బీఆర్ఎస్‌కు ఓటేసి మళ్లీ గెలిపించుకుంటాం. మాకు కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నరు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొంటున్నరు. మా ఖాతాల్లోనే వెంటనే డబ్బులు పడుతున్నాయి. దళారులు లేకుండా మాకు పైసలు అందుతున్నయి. ప్రత్యేక రాష్ట్రం వచ్చాకే రైతుల బతుకులు బాగున్నాయి. గతంలో తెల్లవారుజామున, అర్ధరాత్రి కరెంట్ ఇచ్చేటోళ్లు. పొలం తడిపేందుకు రైతులు పొలానికి వెళితే ఏ పామో, తేలో కుట్టి చనిపోయిన రైతులు ఎందరో ఉన్నారు. అప్పుడు ప్రభుత్వం నుంచి ఒక్క పైసా రాలేదు. **– నర్రా పెద్ద రాము, రైతు, భద్రాచలం**

### కాంగ్రెసోళ్లు రైతులను మభ్యపెడుతున్నరు..



కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో లబ్ధిపొందడానికే రైతులను మభ్యపెడుతున్నరు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏండ్లు పాలించింది. అయినా రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. రైతు సంక్షేమానికి ఏ ఒక్క మంచి పథకం కూడా ప్రవేశపెట్టలేదు. కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎరువులు, విత్తనాల కోసం గోసపడ్డరు. 10 హెచ్‌పీ మోటర్లను ఎవరూ ఉపయోగించరు. 10 హెచ్‌పీ మోటర్ల వల్ల బావిలో నీరు త్వరగా ఇంకిపోయే ప్రమాదం ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఉచితంగా ఇస్తుంటే, కాంగ్రెస్ ఓట్ల కోసం రైతులను మోసం చేయాలని లేని పోని హామీలు ఇస్తున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్ల కింద పంటలకు సరిపడా నీరు అందించుకుంటూ రైతులు రెండు పంటలు సాగుచేసుకుంటున్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మా మద్దతు ఉంటుంది.
**– యక్కంటి వెంకటరెడ్డి, రైతు. ఈబయ్యారం, పినపాక మండలం**

### 10 హెచ్‌పీ మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు పాడవుతాయి



3 గంటల కరెంటు ఇస్తే రైతులకు మళ్లీ కష్టాలు వస్తాయి. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు ఒకే సమయంలో రైతులందరూ 10 హెచ్‌పీ మోటర్లు ఉపయోగించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మరమ్మతులకు గురవుతాయి. గ్రిడ్‌పై లోడ్ పడి విద్యుత్ సంక్షోభం వస్తుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు పంటలకు మూడు గంటల విద్యుత్ ఇస్తామనడం అవగాహన లేనితనం. రైతులందరూ రూ.లక్ష సొమ్ము పెట్టి కొత్తమోటార్లు బిగించుకోవడం అసాధ్యం. 24 గంటల కరెంటు ఇస్తేనే రైతులు ఒకేసారి కాకుండా ఎవరికి వీలైన సమయంలో వారు పంటలకు నీళ్లు పెట్టుకుంటారు. దీంతో విద్యుత్ వ్యవస్థపై భారం పడదు. సీఎం కేసీఆర్ పాలనే రైతులందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్ ఇస్తూ ఆయన రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు.
**– మామిడిపల్లి ప్రసాద్, రైతు, కొండాయిగూడెం, మణుగూరు మండలం**

### బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రైతులకు మేలు...



2014 ముందు ఉన్న పరిస్థితి అందరికీ తెలిసిందే. గతంలో ఏ అర్ధరాత్రో.. అపరాత్రో కరెంట్ రెండు మూడు గంటలు వచ్చి పోయేది. ఆ సమయంలో రైతులు రాత్రులు చేలల్లో పడిగాపులు కాశేవారు. అక్కడే పడుకొని పంటలను తుపుకునే పరిస్థితి ఉండేది. కొందరు రైతులు నాడు పాములు, తేళ్ల కరిచి మృత్యువాత పడ్డారు. కాంగ్రెసోళ్లు ఇచ్చే మూడు గంటల కరెంట్ పంటలకు ఏ కోశానా సరిపోదు. ఇప్పుడున్న పద్ధతే బెటర్. నాడు కేసీఆర్ ఇచ్చిన వాగ్దానంలో భాగంగానే పంటలకు ఉచితంగా 24 గంటల పాటు కరెంట్ అందుతున్నది. నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలంగాణ అంధకారం అవుతుందని అన్నారు. రాష్ట్రాన్ని పరిపాలించుకోలేరు అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీరు లేక, వరి పండించలేక రైతులు వరికి హాలీ డే ఇచ్చిన రోజులు ఉన్నాయి. 10 హెచ్‌పీ మోటర్ బిగుంచుకోవడం రైతులకు సాధ్యం కాని పని. అంత వ్యయానికోర్చి కొనుక్కుంటే రైతు ఆరిపోతాడు.
**– మండె వీరహన్మంతరావు, రైతు, నాయకులగూడెం, సుజాతనగర్ మండలం**

### కరెంట్ ఉండబట్టి రెండు పంటలు పండిస్తున్నాం..



తెలంగాణలో 24 గంటల కరెంట్ ఉండబట్టి రైతులు ఇక్కడ రెండు పంటలు పండిస్తున్నారు. రోజుకు మూడు గంటల కరెంటు అంటే వ్యవసాయం చేయలేం. పంటలు పండవు. పదేండ్లుగా రైతులు లాభసాటి వ్యవసాయం చేస్తున్నామంటే దానికి ప్రధాన కారణం కరెంటు కష్టాలు లేకపోవడంతోనే. మా వరకు మళ్లీ కేసీఆర్ సారే సీఎం కావాలి. రైతులకు అండగా నిలవని కాంగ్రెస్ మాకు వద్దు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే నాడు పడిన కష్టాలన్నీ మళ్లీ పడతాం.
**– ఎస్కే రంజాన్, రైతు, తిప్పనపల్లి, చంద్రుగొండ మండలం**

### రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు..



కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. మూడు గంటలు ఇస్తాం..10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోండి.. అంటూ రైతులకు ఉచిత సలహాలు ఇస్తున్నారు. 10 హెచ్‌పీ మోటార్లు వాడితే బోర్లలో నీరు తగ్గిపోతయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. తెలంగాణ ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తుండడంతో 5 హెచ్‌పీ మోటర్లు సరిపోతున్నాయి. 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. మూడు గంటల కరెంటు అంటే రైతులు ఆగం కావడం ఖాయం.
**– సోము రోశిరెడ్డి, రైతు, సారపాక, బూర్గంపహాడ్ మండలం**

### మూడు గంటల కరెంట్ సరిపోదు



గత ప్రభుత్వాలు రైతులకు తీరని అన్యాయం చేశాయి. గతంలో మేము పడిన కష్టాలు గుర్తు చేసుకోవాలంటే భయమేస్తున్నది. తెలంగాణ వచ్చిన తర్వాతే మేం కోలుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పంటలకు కరెంట్ అందుతున్నది. ఏటా రెండు పంటలు పండించుకోగలుగుతున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇస్తామంటున్న మూడు గంటల కరెంట్‌తో పంటలు పండించలేం. మాకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి. బీఆర్ఎస్ కాకుండా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రైతులకు నష్టం జరుగుతుంది.
**– బి.రాంబాబు, రైతు, తోకబందాల, లక్ష్మీదేవిపల్లి మండలం**

### కేసీఆర్ వెంటే రైతులు..



గతంలో ఎకరా మిర్చి సాగు చేయాలంటే కరెంట్ సరిగా ఉండేది కాదు. రూ.లక్షలు వెచ్చించి బోర్లు వేసినప్పటికీ కరెంట్ సదుపాయం ఉండేది కాదు. కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక ఇబ్బందులు పడ్డాం. సీఎం కేసీఆర్ పంటలకు ఉచితంగా 24 గంటల పాటు కరెంట్ ఇస్తున్నారు. సాగునీటి వసతి బాగుండడంతో ప్రస్తుతం నాకున్న ఐదు ఎకరాల్లో మిర్చి, కూరగాయలు సాగు చేస్తున్నాను. గతం కంటే సాగు ఎక్కువ చేస్తున్నాను. మంచి దిగుబడులు సాధిస్తున్నాను. రైతులు సీఎం కేసీఆర్ వెంటే ఉంటారు.
**– బానోత్ ఈరూనాయక్, రైతు, ఏ కాలనీతండా, టేకులపల్లి మండలం**

### 24 గంటల విద్యుత్ కావాలి..



తెలంగాణ ప్రభుత్వం పంటలకు ఇస్తున్న 24 గంటల విద్యుత్‌తోనే రైతులకు మేలు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న 3 గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా తడవదు. వ్యవసాయంపై అవగాహన లేకుండా కాంగ్రెసోళ్లు మాట్లాడుతున్నారు. వ్యవసాయంపై అవగాహన ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు మంచి చేస్తున్నరు. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే రైతులకు మేలు.
**– బద్దం యాదగిరిరెడ్డి, రామచంద్రాపురం, రైతు, అశ్వాపురం మండలం**

### మూడు గంటల కరెంట్‌తో మాకు కష్టాలు..



కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి మూడు గంటల కరెంట్ ఇస్తే మాకు మళ్లీ కష్టాలు మొదలవుతాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకారం మూడు గంటల కరెంట్‌తో ఎకరా కూడా పారదు. గతంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. రాత్రిళ్లు పొలాల్లోనే ఉంటూ బిక్కు బిక్కుమంటూ ఉండేవాళ్లం. 10 హెచ్‌పీ మోటర్, మూడు గంటల కరెంట్‌తో పొలానికి నీరు పెట్టడం కుదరని పని. 10 హెచ్‌పీ మోటర్ వాడితే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువై పేలిపోతుంది. రైతుల కష్టాలపై అవగాహన లేకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడడం బాధకరం. తెలంగాణ వచ్చినంకనే మేము ఏటా రెండు పంటలు పండించుకుంటున్నాం. మళ్లీ కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు తప్పవు. **– నరెడ్ల ప్రవీణ్, రైతు, ఆళ్లపల్లి**

## ధరణికి జై భూమాతకు నై

- ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న జిల్లా రైతాంగం
- ధరణితోనే పోర్టల్‌తో సజావుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- పైసా ఖర్చు లేకుండా రైతులకు అందుతున్న పాస్ పుస్తకాలు
- దానిని రద్దు చేయడమంటే రైతును దగా చేయడమే..
- కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెబుదామంటున్న రైతులు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ పరిపాలనను శైలిలో గాడిలో పెట్టారు. భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేందుకు.. తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు పైసా ఖర్చు లేకుండా చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ భూములు అమ్ముకోవడం, కొనుగోలు చేసుకోవడం కోసం సులభతరంగా మారింది. ఈ క్రమంలో భూముల విలువ కూడా పెరిగింది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సజావుగా నడుస్తున్న ధరణి పోర్టల్‌పై కన్నేసిన కాంగ్రెస్ దానిని ఎలాగైనా తొలగించాలని కంకణం కట్టుకున్నది. పదే పదే తొలగిస్తామని ఎన్నికల సభలు, సమావేశాల్లో వల్లెవేస్తోంది. దాని స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకొచ్చి కౌలు రైతు కాలం పెడతామని, పటేల్, పట్వారీ వ్యవస్థను ప్రవేశపెడతామని చెబుతున్నారు. దీంతో జిల్లా రైతులు కాంగ్రెస్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఇబ్బందులు పెట్టేందుకు పాత విధానాలు తేవాలని చూస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మొద్దని అంటున్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలపై రైతులు బహిరంగంగానే విమర్శలకు దిగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో సదరు పార్టీ నాయకులకు తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

ధరణి

### కాంగ్రెస్ వస్తే రైతు బతుకు ఆగమే..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటగా నష్టపోయేది రైతులే. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు రైతులకు ఆ పార్టీ ఏం మేలు చేసిందో అందరికీ తెలుసు. మళ్లీ రైతులను ఉద్ధరించేందుకు అధికారంలోకి వస్తే మూడు గంటలు కరెంట్ సరిపోతుందని చెప్పడం దారుణం. ధరణిని రద్దు చేస్తామని చెప్పడం సరికాదు. తెలంగాణ ప్రభుత్వంలోనే మాకు పెట్టుబడి సాయం అందింది. సొంత పెట్టుబడి పెట్టుకొని పంటలు పండించుకోగలుగుతున్నాం. ఇప్పుడు వచ్చిందంతా మాకు లాభమే అవుతుంది. మా మద్దతు బీఆర్ఎస్‌కే. **– ఎ.లక్ష్మణ్, రైతు, లక్ష్మీదేవిపల్లి**

### ధరణితో రెవెన్యూ రికార్డులు భద్రం




ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌తో రెవెన్యూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరి భూములు ఎవరికి రాశారో తెలియని పరిస్థితి. ధరణి వచ్చాకే భూములకు భద్రత వచ్చింది. ఇప్పుడు భూములు అమ్మాలన్నా, కొనుగోలు చేయాలన్నా ధరణి ద్వారా నిమిషాల్లో పని అవుతుంది. ధరణిని రద్దు చేస్తే సమస్యలు పెరుగుతాయి. మళ్లీ రైతులకు పాతరోజులే వస్తాయి.
**– పగడాల రామిరెడ్డి, రైతు, బీజీ కొత్తూరు, అశ్వాపురం మండలం**

### ధరణితోనే పారదర్శకత..



ధరణి పోర్టల్‌తోనే రైతులకు ఎంతో మేలు జరిగింది. భూరికార్డులకు భద్రత వచ్చింది. కాంగ్రెస్ ధరణిని తీసేస్తాననడం మూర్ఖత్వపు ఆలోచన. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణితో భూముల హక్కులపై దళారుల పెత్తనం పూర్తిగా తొలిగిపోయింది. లంచాలు బాధ పోయింది. ఒకరి పొలం మరొకరి మీద మార్చడం వంటివి లేనే లేవు. ధరణితోనే రైతుల భూములకు భద్రత.
**– గుడ్ల రంజిత్ కుమార్, రైతు, గొల్లగూడెం, కరకగూడెం మండలం**

### గతంలో గొడవలు



గతంలో పహాణీ అవసరమై తీసుకుంటే దానిలో అనుభవదారు కాలం ఉండేది. ఒకరి పేరుపై మరొకరికి పట్టా ఉండేది. అధికారుల చేయితడిపితే ఎవరి పేరుపైనైనా పట్టా మారేది. అసలు రైతుకు తర్వాత విషయం తెలిసి గొడవలయ్యేవి. ధరణి వచ్చాకే పట్టా కాలం ఒకటే ఉండడంతో ఒకరి భూమిని ఇంకొకరికి మార్చేందుకు వీలు లేని విధానం వచ్చింది. ధరణిపై కొంతమందికి సరైన అవగాహన లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ధరణితోనే రైతులకు మేలు జరుగుతుంది.
**– ఇస్లావత్ బాలూనాయక్. రైతు, సంపత్‌నగర్, టేకులపల్లి మండలం**

### రెవెన్యూ ప్రక్షాళన జరిగింది..



ధరణితో రెవెన్యూ వ్యవస్థలో ప్రక్షాళన జరిగింది. గతంలో రెవెన్యూ రికార్డులు తారుమారయ్యేవి. నేడు ఆ పరిస్థితి లేదు. వేలిముద్రల సహాయంతో క్రయ, విక్రయాలు వెంటనే జరిగిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ మార్పు కూడా తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్నాయి. గతంలో రైతులు రిజిస్ట్రేషన్ల కోసం రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. **– దస్తగిరి, రైతు, బూర్గంపహాడ్**

### భూమాత వద్దే వద్దు..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తీసేసి, భూమాత పోర్టల్ తీస్తానంటున్నది. రెవెన్యూ రికార్డుల్లో కౌలుదారు/అనుభవదారు కాలమ్ పెడతానంటున్నది. అదే జరిగితే రైతు బతుకు ఆగమాగం అవుద్ది. భూమాత పెడితే పాత రెవెన్యూ వ్యవస్థ వస్తది. అవినీతి వ్యవస్థ పుట్టుకొస్తుంది. ప్రస్తుత ధరణితో మా భూములకు భద్రత వచ్చింది. సర్వే నంబర్ల సాయంతో ఇప్పుడు మా భూములను మొబైల్‌లోనే చూసుకుంటున్నం. భూమాత పోర్టల్‌పై మాకు నమ్మకం లేదు. మళ్లీ కాంగ్రెస్ వాళ్లు కొత్త రూల్స్ పెడతారు. మా బాధలు మళ్లీ మొదలైతయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధుతో మాకు పంట పెట్టుబడి అందుతున్నది. భూమాత వస్తే మాకు సాయం అందుతుందనే నమ్మకం లేదు.
**– దారపునేని రాంబాబు, రైతు, భద్రాచలం**

### ధరణి తీసేస్తే రైతులు దోపిడీకి గురవుతారు..



ధరణి పోర్టల్‌ను తీసేస్తే రైతులు మళ్లీ దోపిడీకి గురవుతారు. కాంగ్రెస్ నేతలకు రైతులు బాగుండడం ఇష్టం లేదు. వారిని దోచుకోవడానికి ఆ పార్టీ నేతలకు మార్గాలు కావాలి. అందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు. కొత్త పోర్టల్ వస్తే రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. పటేల్, పట్వారీ వ్యవస్థతో భూములు తారమారయ్యే ప్రమాదం ఉంది. లంచాల్వికపోతే అధికారులు పనిచేయరు. గతంలో ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరుపై రాసేవారు. అలాంటి దుర్మార్గాలు జరగొద్దని ముఖ్యమంత్రి కేసిఆర్ ధరణి పోర్టల్ తెచ్చి రైతు భూమికి భద్రత కల్పించారు. రైతుబంధు ఇస్తున్నరు. రైతుబీమా కల్పిస్తున్నరు. వడ్లు కొనుగోలు చేసిన డబ్బులను నేరుగా మా అకౌంట్లో వేయిస్తున్నరు. కాంగ్రెస్ కపట నాటకాలను ఎన్నికల్లో తిప్పికొడతాం.
**– మూడ్ హనుమా, రైతు, రొంపేడు, ఇల్లెందు మండలం**

### కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలి..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తొలగిస్తామంటున్నది. ధరణితోనే రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు పటేల్, పట్వారీ వ్యవస్థ లాంటిది మళ్లా వస్తే రైతులు మళ్లీ కష్టాలు పడతరు. అధికారులు చేతివాటం ఎక్కువవుతుంది. రైతులు చిన్న పహాణీ నకలు కావాలన్నా రెవెన్యూ ఆఫీసులు చుట్టూ తిరిగాల్సివస్తుంది. రైతులు భూమాత పోర్టల్‌ను వ్యతిరేకించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి.
**– కిలారు నాగేశ్వరరావు, పాల్వంచవాసి**

### కాంగ్రెస్ వస్తే లంచాల బాధ తప్పదు..



బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. పోర్టల్ ద్వారా అరగంటలో భూరిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 15 రోజుల్లో పాస్‌బుక్ ఇంటికి వస్తుంది. ఒక రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పని లేదు. మన వేలిముద్ర వేస్తేనే పోర్టల్ ఓపెన్ అవుతుంది. మన భూమి ఎక్కడికి పోదు. ల్యాండ్ కన్వర్షన్ కూడా పది నిమిషాల్లో అయిపోతుంది. గతంలోనైతే రైతులు మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కింది నుంచి పైదాకా ప్రతి అధికారికి లంచం ఇవ్వాల్సిన పని ఉండేది. తిరిగి దాన్నే కాంగ్రెస్ తీసుకొస్తానంటున్నది. రైతులు మళ్లా ఇబ్బందులు పడతరు.
**– రెడ్డెం తులసీరెడ్డి, రైతు, వేపలగడ్డ**